

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 355 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 26, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

భారత రాజ్యాంగాన్ని..

కాపాడుకోవడం మన బాధ్యత !

భారత ప్రజాస్వామ్యానికి పునాది.. దేశ ప్రజల హక్కులకు రక్షణ కవచం భారత రాజ్యాంగం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అయితే రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలు, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతపై దేశవ్యాప్తంగా చర్చలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతోంది. చట్టసభలు, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, మీడియా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థల స్వతంత్రతపై మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమాలు సాగుతున్నప్పటికీ మరింత విస్తృతమైన ప్రజా చైతన్యం అవసరమని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కవులు, రచయితలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, యువత రాజ్యాంగ విలువల పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైంది. అధికారంలో ఎవరున్నా రాజ్యాంగానికి లోబడి పాలన సాగించడమే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అంటే దేశ ప్రజల హక్కులను, భవిష్యత్తును కాపాడుకోవడమేనని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాజ్యాంగ మూలలను రక్షించలేక పోతున్న కేంద్రప్రభుత్వం

భారత రాజ్యాంగంలోని ఒక్కొక్క ప్రధాన అంశాన్ని నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నారు

దేశానికి రక్షణగా నిలుస్తున్న రాజ్యాంగం రక్షణ కోసం రాజీలేని పోరాటాలు సాగుతున్నాయి

మేధావులు, కవులు, రాజకీయ విశ్లేషకులు భారత రాజ్యాంగ రక్షణ పోరాటంలో పాల్గొనాలి.

రాజ్యాంగ రక్షణ విషయంలో ఉద్యమకారులు వెనుకబడి పోతున్నారు.

ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో విస్మరిస్తున్నాయి

రాజ్యాంగంలో భాగమైన చట్టాలు న్యాయస్థానాలు ఎవరి కోసం పని చేస్తున్నాయి

దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించడమే రాజ్యాంగ అభివృద్ధి

రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడలేని పాలకులు : డాక్టర్ బరిగెల శివ

2


దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పోలీస్ స్టేషన్

ఫిర్యాదు స్వీకరణ నుంచి చార్జిషీట్ దాఖలు వరకు కృత్రిమ మేధస్సు సేవలు

ఏఐ ఆధారిత సాంకేతిక పనులను ఆకస్మికంగా పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ భగవత్

2



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి: కేటీఆర్ డిమాండ్

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తున్న నేతల అరెస్ట్‌పై కేటీఆర్ మండిపాటు

ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని పోలీసులతో అణచివేయడం

సరికాదని వ్యాఖ్య

ట్రక్ పార్క్ భూమి వేలాది మందికి జీవనోపాధి అన్న కేటీఆర్

7



స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ విలీనంపై ఏకపక్ష నిర్ణయాలు వద్దు: కవిత



విద్యారంగంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వానికి సూచించిన కవిత

స్టేక్‌హోల్డర్లతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాతే ముందడుగు వేయాలని డిమాండ్

కొత్త విధానంతో తల్లిదండ్రులపై మరింత ఫీజుల భారం పడుతుందని ఆందోళన

2



గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

'ఖేలో ఇండియా గేమ్స్'పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

డిసెంబర్ 11 నుంచి తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవం గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు

ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు

తొలిసారి ప్రదర్శన క్రీడగా తెలంగాణ సంప్రదాయ కర్రసాము

క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

వివరాలు 2లో

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

దేశంలోనే తొలి ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పోలీస్ స్టేషన్

ఫిర్యాదు స్వీకరణ నుంచి చార్జిషీట్ దాఖలు వరకు కృత్రిమ మేధస్సు సేవలు
ఏఐ ఆధారిత సాంకేతిక పనులను ఆకస్మికంగా పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్
హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ భగవత్





హైద్రాబాద్, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

దేశంలోనే తొలి కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్ట పోలీస్ స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న సాంకేతిక ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని అన్ని పోలీసింగ్ సేవలను అత్యాధునిక ఏఐ సాంకేతికతతో అనుసంధానం చేయనున్నారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వరకు వివిధ దశల్లో ఏఐ సేవలను వినియోగించనున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఉన్నతాధికారులు నేరుగా మాట్లాడి, ఏఐ వ్యవస్థ ద్వారా సిబ్బంది వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు, ఎలా పరిష్కరిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని ప్రతి సిబ్బంది పనితీరును పరిశీలించి, ఏఐ సాంకేతికత సహాయంతో విధులు ఎలా నిర్వహిస్తున్నారో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఖైరతాబాద్ జోన్ డీసీపీ, ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సాంకేతిక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ, ఏఐ ఆధారిత పోలీస్ స్టేషన్‌ను త్వరలో పైలట్ ప్రాజెక్టుగా అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పోలీస్ సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) అకున్ సబర్వాల్, హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ అండ్ ఎస్ఐటీ) ఎం. శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, టీఎస్‌పార్క్ ఎస్పీ రూపేష్, ఎస్ఎంఐటీ డీసీపీ అరవింద్ బాబు తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు పండుగల సాయన్నకు ఘన నివాళి.. ఐదు గ్రామాల్లో విగ్రహాల ఆవిష్కరణ

డా. వెన్న ఈశ్వరప్ప



వికారాబాద్, 15 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన బహుజన వీరుడు పండుగల సాయన్న విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం పరిగి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గండీడ్ మండల కేంద్రంతో పాటు కొమిరెడ్డిపల్లి, వెన్నచేడ్, సల్కర్‌పేట్, రెడ్డిపల్లి గ్రామాల్లో విగ్రహాలను ఆవిష్కరించి పండుగల సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ.. “ఉన్నోళ్లను కొట్టిండు.. లేనోళ్లకు పెట్టిండు” అనే నినాదంతో పేదల పక్షాన నిలిచిన పండుగల సాయన్న జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఆయన, విగ్రహాల నిర్వహణ కోసం మండల నిర్వాహకులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఉపసభాపతి బండా ప్రకాశ్ ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, స్థానిక ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, విగ్రహాల దాత ఆగం పాండు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఏవీ రాములు, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోయిన గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, వివిధ మండలాల నుంచి తరలివచ్చిన ముదిరాజ్ సోదరులు, ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భారత రాజ్యాంగాన్ని శాసించడం నేరం

రాజ్యాంగ మూలలను రక్షించలేక పోతున్న కేంద్రప్రభుత్వం
భారత రాజ్యాంగంలోని ఒక్కొక్క ప్రధాన అంశాన్ని నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నారు
దేశానికి రక్షణగా నిలుస్తున్న రాజ్యాంగం రక్షణ కోసం రాజీలేని పోరాటాలు సాగుతున్నాయి
మేధావులు, కవులు, రాజకీయ విశ్లేషకులు భారత రాజ్యాంగ రక్షణ పోరాటంలో పాల్గొనాలి.
రాజ్యాంగ రక్షణ విషయంలో ఉద్యమకారులు వెనుకబడి పోతున్నారు.
ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో విస్మరిస్తున్నాయి
రాజ్యాంగంలో భాగమైన చట్టాలు న్యాయస్థానాలు ఎవరి కోసం పని చేస్తున్నాయి
దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించడమే రాజ్యాంగ అభివృద్ధి
రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడలేని పాలకులు
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భారతదేశానికి రక్షణ కవచంలాగా నిలుస్తున్న భారత రాజ్యాంగాన్ని విస్మరిస్తూ నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కుట్రలు పన్నుతున్నదని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం అనేది భారత రాజ్యాంగంలోని భాగమైనప్పుడు భారత రాజ్యాంగం స్థాపించిన చట్టం ప్రకారం ఏర్పడ్డ ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని మింగేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో సమకాలీన కాలపరిమితులకు సైతం ఎల్లవేళలా న్యాయం చేయగల భారత రాజ్యాంగం తరతరాలు సురక్షితంగా నిలవాల్సిందిపోయి కేంద్ర పాలకుల కుట్రలో విచ్ఛిన్నం చేయబడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వ పాలకులు భారత రాజ్యాంగం అనేసరికి పట్టింపు లేని విధంగా ప్రవర్తిస్తూ భారత రాజ్యాంగాన్ని చిన్న చూపు చూడడం రాజకీయ మూర్ఖత్వం అన్నారు. ప్రతి రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధమైన పాలన నడుస్తుందని దానివల్ల దేశ ప్రజలు అన్ని విధాలుగా తీవ్రంగా నష్టపోతున్నారని హెచ్చరించారు. దేశ ప్రజలను రక్షించడం ప్రభుత్వాలకు ఏమాత్రం ఇష్టం లేదని అదే సందర్భంలో దేశ ప్రజలకు చట్టాల రూపంలో న్యాయస్థానాల రూపంలో రక్షణగా నిలుస్తున్న భారత రాజ్యాంగాన్ని మాత్రం ఖూనీ చేయడానికి కంకణభద్దులౌతున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగ పీఠాన్ని అత్యంతగా గౌరవిస్తూ భారత రాజ్యాంగంలోని ప్రధానమైన అంశాలను పాలన సూచనగా తీసుకుంటూ భారత రాజ్యాంగానికి గౌరవం కల్పిస్తుంటే దేశ పాలకులు మాత్రం భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ప్రభుత్వాన్ని పాలిస్తున్నారని అలాంటి పాలన దేశానికి ఎంత ప్రమాదం దేశ మేధావులు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. భారత రాజ్యాంగం రక్షణ కోసమే ఏర్పడిన దేశ మీడియా, దేశ అత్యున్నత న్యాయస్థానాలు ఎంతలా అదుపుతప్పుతున్నాయో ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అరాచకాలను చూస్తుంటే స్పష్టమవుతుందన్నారు. మీడియా రాజ్యాంగంలోని ప్రధాన భాగం కాగా నేటి భారతదేశ మీడియాని శాసిస్తున్నదంతా కరుడుగట్టిన నేరస్తులు, కరుడుగట్టిన రాజ్యాంగ వ్యతిరేక పాలకులు, కరుడుగట్టిన రాజ్యాంగ వ్యతిరేక భావాజాలం కలిగిన సంస్థలు మాత్రమే అంటూ వెల్లడించారు. రాజ్యాంగంలోని చట్టాలను పకడ్బందీగా అమలుపరచగలిగితే భారత దేశ ప్రజలకు ఏ ప్రభుత్వము స్వతహాగా సహాయ పడాల్సిన అవసరాలు లేవని స్పష్టం చేశారు. దేశ ప్రజలను కోరుకుంటున్నా జీవనానికి నోచుకోకుండా, అభివృద్ధికి నోచుకోకుండా అన్ని విధాలుగా తీవ్రమైన నష్టాలపాలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని దేశ పాలకులు తక్షణమే భారతదేశాన్ని వదిలి వెళ్ళిపోవాలన్నారు. దేశాన్ని పాలించ చేతకాక దేశ రక్షణ కోసం సువర్ణ అక్షరాలతో లిఖించబడిన భారత రాజ్యాంగాన్ని నాశనం చేయాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీ దేశ ప్రజల చేతిలో చిత్తు అవడం ఖాయం అన్నారు. కేవలం అధికారం సంపాదించుకోవడం కోసమే జాతీయ ఎన్నికల కమిషన్ విధానాన్ని భారత రాజ్యాంగ చట్టానికి విరుద్ధంగా ఏర్పాటు చేసుకున్న ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్ షా అధికార పదవిలో ఉన్నంతకాలం దేశ ప్రజలకు జవాబు చెప్పరని తెలిసినప్పటికీ అధికారం కోల్పోయిన రోజున వాళ్ళ పాలనలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఎన్ని దుర్మార్గమైన పనులు చేశారు బయటపడక తప్పదు అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు దిగజారి పనిచేయడం అధికార దుర్వినియోగం అని అది రాజ్యాంగ పాలనకు విరుద్ధమని తెలుస్తున్నప్పటికీ అవినీతిపరులకు అక్రమార్కులకు రక్షణగా నిలుస్తున్న ప్రభుత్వ పాలకులు చివరకు ప్రభుత్వ వ్యవస్థలను కూడా నాశనం చేయడానికి వెనుకాడడం లేదంటూ హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశాన్ని ఒక సుస్థిరమైనటువంటి రక్షణలో ఉంచారని తన కలలను భారత రాజ్యాంగ రచనల రూపంలో సార్థకం చేసుకున్నారని ఆనాటి నుండి నేటి వరకు భారత రాజ్యాంగం రక్షించుకోవాలనే బలమైన సంకల్పం దేశంలోని యువతలో పెరిగిపోతుండగా రాజ్యాంగం బ్రతికుంటే దేశ పాలకులకు బ్రతుకుండదని తెలిసి భారత రాజ్యాంగాన్ని నిర్మూలింప చేస్తూ పాలకుల ఆచరణలను అమలుపరచుకోవాలని బలపంతపు ఒత్తిడిలతో కూడిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. భారత రాష్ట్రపతి, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కేంద్ర ప్రభుత్వానికి జోకుడు మాని రాజ్యాంగ రక్షణ విషయంలో న్యాయబద్ధంగా నిలవాలని కోరడమైందన్నారు. దేశ ప్రజల భవిష్యత్తు, దేశ ప్రజల అభివృద్ధి భారత రాజ్యాంగ పరిరక్షణలో దాగిందని గుర్తిస్తున్న దేశ యువత, దేశ ప్రతిపక్ష పార్టీలు రాజ్యాంగ రక్షణ కోసం రక్తం చిందిస్తున్నారని గర్వపడ్డారు. దేశవ్యాప్తంగా ప్రధాన మీడియాలు మొదలుకొని చిన్న మీడియా వరకు భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూ దూసుకుపోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు భారీ ఏర్పాట్లు

డిసెంబర్ 11 నుంచి 22 వరకు 27 క్రీడాంశాల్లో పోటీలు.. నిర్వహణకు రూ.203 కోట్లు

హైద్రాబాద్, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ భవిష్యత్తు క్రీడలకు బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఈ క్రీడల ఏర్పాట్ల పురోగతిపై మంత్రి వాకిటి శ్రీహరితో పాటు సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 11న యువతలో నూతన ఉత్సాహం నింపేలా క్రీడలను అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవాన్ని హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించాలని, నగరమంతా క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టేడియంల పునరుద్ధరణ, అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విజిలెన్స్ పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ప్రారంభ, ముగింపు వేడుకల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించాలని, హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్వహించే పోటీల పర్యవేక్షణకు ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహబూబ్‌నగర్‌కు జూపల్లి కృష్ణారావు, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కరీంనగర్‌కు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మంకు తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డిని బాధ్యులుగా నియమించారు. తెలంగాణ సంప్రదాయ యుద్ధకళ అయిన కర్రసాముని తొలిసారిగా ఈ పోటీల్లో ప్రదర్శన క్రీడగా ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. కర్రసాముకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి, జాతీయ వేదికపై ఈ సంప్రదాయ కళకు గుర్తింపు కల్పించడం ద్వారా రాష్ట్రంలో మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ నెలాఖరు నాటికి స్టేడియాలకు సంబంధించిన అభివృద్ధి పనులు, 27 క్రీడాంశాలకు అవసరమైన క్రీడా పరికరాల ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 14 స్టేడియాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన ఆరు స్టేడియాల్లో పనులను నెలాఖరులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన 1,334 మంది క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయగా, రాష్ట్రం నుంచి పాల్గొనే 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.203 కోట్లు వెచ్చిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21 కోట్లు కేటాయించింది. స్టేడియాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టడం, అత్యాధునిక క్రీడా పరికరాలు సమకూర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చు చేస్తోంది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనువుగా క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ విలీనంపై ఏకపక్ష నిర్ణయాలు వద్దు: కవిత

విద్యారంగంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వానికి సూచించిన కవిత
స్టేక్‌హోల్డర్లతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాతే ముందడుగు వేయాలని డిమాండ్
కొత్త విధానంతో తల్లిదండ్రులపై మరింత ఫీజుల భారం పడుతుందని ఆందోళన

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ఇంటర్మీడియట్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, జూనియర్ కాలేజీలు, పాఠశాల యాజమాన్యాలు, విద్యావేత్తలతో సమగ్ర చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే ప్రభుత్వం ఎలాంటి అడుగైనా వేయాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డును స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే, విద్యారంగానికి సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియపై స్పష్టత కొరవడిందని చెబుతూ... “స్కూల్ విద్యలో ఇంటర్‌ను విలీనం చేస్తారా? లేక ఇంటర్ విద్యలో పాఠశాల విద్యను కలుపుతారా? అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. 9, 10, 11, 12 తరగతుల విధానం వస్తే తల్లిదండ్రులపై మరింత భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్ విద్య కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, నిధుల విడుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఆమె తప్పుబట్టారు. కేంద్రం నుంచి కరవు సహాయం తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. కరవు ప్రభావిత మండలాలపై ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించాలని, రైతులకు పంటల ధరలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మహిళల రక్షణ మనందరి బాధ్యత.. స్త్రీ అంటే సృష్టికి మూలం

డా. అడ్డాల సత్యనారాయణ

కాకినాడ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

మహిళలపై హింసను అరికట్టి, వారికి సమాజంలో రక్షణ, గౌరవం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీ సత్య దంత వైద్యశాల అధినేత డా. అడ్డాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా నవంబర్ 25న కాకినాడ నగరంలోని నాగమల్లి తోట వద్ద ఉన్న టీం ఆసుపత్రిలో మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న శారీరక, మానసిక, గృహ హింసను అరికట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 1960 నవంబర్ 25న డొమినికన్ రిపబ్లిక్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మిరాబల్ సోదరీమణులు ప్యాట్రియా, మినర్వా, మరియా తెరెసాలను దారుణంగా హత్య చేశారని, వారి త్యాగానికి గుర్తుగా 1981 నుంచి మహిళా హక్కుల కార్యకర్తలు ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించారని వివరించారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని, హింసకు గురైన మహిళలకు న్యాయపరమైన, వైద్యపరమైన, మానసిక సహాయం అందించాలని సూచించారు. నవంబర్ 25న ప్రారంభమయ్యే ఈ అవగాహన కార్యక్రమాలు డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఇంట్లో మౌనం, బయట భయం అనే పరిస్థితుల నుంచి మహిళలకు విముక్తి కల్పించాలని, మహిళలపై చేయి చేసుకోవడం బలం కాదని, అది పురుషుల బలహీనతకు నిదర్శనమని అన్నారు. స్త్రీ అంటే సృష్టికి మూలమని, ఆమెను గౌరవించడం, రక్షించుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్, వర్మ, డా. సబిత, జ్యోతి, జయలక్ష్మి, ప్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక ఎన్నికల సామాగ్రి పంపిణీ సక్రమంగా జరగాలి





అదనపు ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

నగరపాలక మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, భద్రతా ఏర్పాట్లు, సామాగ్రి పంపిణీ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని మొత్తం 72 వార్డులకు సంబంధించి 494 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, సిరా తదితర ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ముందుగా స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులకు రాండమైజేషన్ నిర్వహించి, అనంతరం కేటాయించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను పంపిణీ కేంద్రానికి తీసుకొచ్చి వాటి సంఖ్య, పనితీరు, ఇతర సామగ్రిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు వివరించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య బస్సుల్లో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు బయలుదేరినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, రూట్ ఆఫీసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. నగరంలో 72 వార్డు సభ్యుల స్థానాలకు గాను రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 494 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 4,63,322 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, వీరిలో 2,23,637 మంది పురుషులు, 2,39,615 మంది మహిళలు, 70 మంది ఇతర ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఎన్నికల విధుల కోసం 28 మంది రిటర్నింగ్ అధికారులు, 31 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 593 మంది ప్రిసైడింగ్ అధికారులు, 593 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,371 మంది ఇతర పోలింగ్ అధికారులు, 26 మంది జోనల్ అధికారులు, 24 మంది రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. అలాగే 61 ప్రాంతాల్లోని 199 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 65 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని పోలీసు భద్రత మధ్య ఎస్‌కేవీటీ కళాశాలలోని రిసెప్షన్ కేంద్రానికి తరలించి, అక్కడి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నగరపాలక ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ క్షితిజ్ ఆదిత్య శర్మ, అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 104 మొబైల్ ఫోన్లు రికవరీ

బాధితులకు ఫోన్లు అందజేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

వరంగల్, నవంబర్ 25 (జై భీమ్ క్రైమ్ న్యూస్)

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొత్తం 104 మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. ఈ మొబైల్ ఫోన్లను బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ బాధితులకు స్వయంగా అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వాటిని తిరిగి అందించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీసీఎస్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీసీఎస్ ఏసీపీ పి. సదయ్య, సీసీఎస్ ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్‌ల సూచనలు, పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు ఎస్. రాములు, జితేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని మొబైల్ ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించారు. చాలా రోజులుగా తమ మొబైల్ ఫోన్లు తిరిగి వస్తాయో లేదోనని ఎదురుచూస్తున్న బాధితులకు వాటిని తిరిగి అందజేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. పోలీసుల కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా 104 మొబైల్ ఫోన్ల రికవరీకి కృషి చేసిన సీసీఎస్ ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్, కానిస్టేబుళ్లు ఎస్. రాములు, జితేందర్‌లను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి, సీఈఐఆర్ పోర్టల్‌లో కూడా ఫోన్ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ పి. సదయ్య, సీసీఎస్ ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్, కానిస్టేబుళ్లు ఎస్. రాములు, జితేందర్ పాల్గొన్నారు.



15 మంది రౌడీషీటర్లకు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరిక

రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్..
ఏడాది పాటు సత్ప్రవర్తనతో ఉండాలని ఆదేశం
నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తు జప్తుతో పాటు జైలుశిక్ష తప్పదని స్పష్టం

కరీంనగర్, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 15 మంది రౌడీషీటర్లను బుధవారం పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) గౌస్ ఆలం, ఐపీఎస్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బిఎన్ఎన్ఎస్)లోని 126 నుంచి 136 సెక్షన్ల ప్రకారం ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష పూచీకత్తుతో బాండ్లు రాయించుకున్నారు. ఏడాది పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశించారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా వ్యవహరిస్తే పూచీకత్తు సొమ్మును జప్తు చేయడంతో పాటు చట్టప్రకారం జైలుశిక్ష కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలు సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని కమిషనర్ తెలిపారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు. నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ ప్రజలకు భద్రత కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారెవరినీ ఉపేక్షించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి.. నలుగురు అరెస్ట్

రూ.8,930 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



బెల్లంపల్లి, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో అక్రమ పేకాట కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్లంపల్లి బస్తీలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్ తన సిబ్బందితో కలిసి ఈ దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న దేవసాని సత్యనారాయణ (బెల్లంపల్లి బస్తీ), తుల భరత్ కుమార్ (8 ఇంక్లైన్ కాలనీ, గోదావరిఖని), దాసరి నాగేష్ (బెల్లంపల్లి), అనవర్తి రాజలింగు (బెల్లంపల్లి)లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి పేకాటకు వినియోగిస్తున్న రూ.8,930 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పట్టణంలో అక్రమ జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

శ్రీలంకలో మెరిసిన కాకతీయ విద్యార్థిని.. కృష్ణవేణికి సిల్వర్ మెడల్

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని మాచర్ల కృష్ణవేణి అంతర్జాతీయ క్రీడా వేదికపై సత్తా చాటి రజత పతకాన్ని సాధించారు. శ్రీలంకలోని రత్నాపురలో నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించిన రెండో దక్షిణాసియా స్థాయి పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించిన ఆమె ఈ ఘనత సాధించి దేశానికి, కాకతీయ విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచారు. ఈ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, కృష్ణవేణి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి రెండో స్థానంలో నిలిచారు. దీంతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీలంక గవర్నర్ చేతుల మీదుగా ఆమె రజత పతకాన్ని అందుకోవడం విశేషం. పరిమితులను అధిగమించి పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటిన కృష్ణవేణి విజయం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ముఖ్యంగా దివ్యాంగ క్రీడాకారులకు ఆమె సాధించిన విజయం ఎంతో ప్రేరణనిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. కృష్ణవేణి సాధించిన ఈ విజయంపై కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు కృష్ణవేణికి అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలి

కాట్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం రాయపర్తి మండలం కాట్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం తయారు చేయకపోవడంపై సంబంధిత సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యతను విస్మరించకూడదని, ప్రతిరోజూ నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదివే సామర్థ్యం, విషయ పరిజ్ఞానం, అభ్యసన స్థాయిని స్వయంగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారిని అభినందించారు. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు తీరును తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రతిరోజూ నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం, ఎదుగుదలపై అంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

కేయూను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు వాలంటీర్ల సేవలు

హన్మకొండ, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 28న నిర్వహించనున్న 24వ స్నాతకోత్సవం (కాన్వకేషన్) నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రసాయన శాస్త్ర విభాగం, ఇంటిగ్రేటెడ్ పీజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక శిబిరం నవంబర్ 27వ తేదీ వరకు కొనసాగుతుందని ఇంటిగ్రేటెడ్ పీజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. మమత తెలిపారు. స్నాతకోత్సవానికి వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రముఖులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, పరిసరాల శుభ్రత కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో భాగంగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రపరచడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థులు చేపడుతున్న ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయ పరిశుభ్రతకు దోహదపడటంతో పాటు సేవాభావం, బాధ్యతాయుతమైన పౌరసత్వ లక్షణాలను పెంపొందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



భూముల రీసర్వే వేగవంతం చేయాలి





అర్హులందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అందించాలి

ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

దామెర, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు వారి భూముల విస్తీర్ణంపై స్పష్టమైన వివరాలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. బుధవారం దామెర మండలం వెంకటాపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించి భూముల రీసర్వే ప్రక్రియ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల నమోదు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గ్రామంలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేశారు, ఇంకా ఎంత విస్తీర్ణం మిగిలి ఉంది, ఎన్ని రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తారు, భూముల కొలతలకు వినియోగిస్తున్న సాంకేతిక పరికరాలు తదితర వివరాలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన కొలతలు చేపట్టాలని, సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు తన భూమి వాస్తవ విస్తీర్ణంపై స్పష్టమైన వివరాలు అందించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు అదనంగా మరో రోవర్‌ను కేటాయించినట్లు తెలిపారు. మరో గ్రామంలో కూడా రీసర్వే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. మోర్తాల శ్రీనివాస్ అనే లబ్ధిదారుడి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించి, నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయన ఫోన్‌కు వచ్చిన సందేశాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులతో పాటు వారి నామినీ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారు ఎవరూ ప్రభుత్వ పథకానికి దూరం కాకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వీవో భవనాన్ని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న భోజనం, పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పిల్లలు కేంద్రానికి హాజరవుతున్నారు, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. కేంద్రంలోని వాటర్ ప్యూరిఫైయర్, ఇతర మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ సేవల నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల గ్రామాల సర్పంచులు పంచగిరి రాజు, చంద్రం, రవి యాదవ్, భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, స్థానిక తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, డీఐ సతీష్ చంద్ర, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్థానిక రైతులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు కల్పించాలి

ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి డిమాండ్

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయడంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం హనుమకొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రేణుకకు పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సొంత ఇళ్లు, నివాస స్థలాలు లేక నిరుపేదలు, నిరాశ్రయులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలకు అనుకూలంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు.



నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ భూములను వేలం పాటల ద్వారా విక్రయించడం వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వ భూములు ప్రజల అవసరాలకు, ముఖ్యంగా నిరుపేదల నివాస అవసరాలకు ఉపయోగపడాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మియాపూర్ ప్రాంతంలో సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూముల సమస్యతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నెలకొన్న ప్రభుత్వ భూముల సమస్యలను పరిష్కరించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, రంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి పేదల నివాస అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, నిరుద్యోగులు, నిరుపేద కుటుంబాలకు నివాస హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వ భూములను వేలం వేయకుండా పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరుపేదల నివాస హక్కును కాపాడాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఇళ్లు లేని పేద కుటుంబాలకు న్యాయం చేయాలని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు కూతురు ఇంద్రారెడ్డి, పార్టీ సభ్యులు నూతనకంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో అంబేద్కర్ చిత్రపటం ఉండాలి: చిక్కం జానయ్య మాదిగ

నూతన వధూవరులకు అంబేద్కర్ చిత్రపటాల అందజేత

మంత్రాలయం, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కులమతాలకు అతీతంగా ప్రతి ఇంట్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటం ఉండాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం వగరూరు, వి. తిమ్మాపురం గ్రామాలకు చెందిన నూతన వధూవరులు చిక్కం చరణ్--కుమారి, నవీన్ కుమార్--పుష్ప స్వప్న వివాహాల సందర్భంగా ఆయన నూతన దంపతులను ఆశీర్వదించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ దేవుళ్ల చిత్రపటాలతో సమానంగా ప్రతి ఇంట్లో అంబేద్కర్ చిత్రపటాన్ని కూడా ఏర్పాటు చేసుకునేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 2,645 అంబేద్కర్ చిత్రపటాలను నూతన వధూవరులకు, ఇతరులకు అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు శవాల బుజ్జిబాబు, నందవరం మండల నాయకులు తాయన్న, వి. తిమ్మాపురం గ్రామ నాయకులు చిక్కం ఏలీయా, రామచిలకల విజయకుమార్, చిలకలడోన గ్రామ నాయకులు పురుషోత్తం, వగరూరు గ్రామ నాయకులు సుదర్శనం, చిన్న, భూపతి, దేవన్న, మారెప్ప, సామెల్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.



హాసన్‌పర్తి ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో పాము కలకలం

ఎంపీడీఓ కార్యాలయంలో ద్విచక్ర వాహనంలోకి దూరిన పాము.. బయటకు పంపేందుకు వాహనదారుల అవస్థలు
ఒకే ప్రాంగణంలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఎంఆర్ఓ, ఏఈఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్.. ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం

హాసన్‌పర్తి, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

హాసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో పాము ప్రత్యక్షం కావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయ ప్రాంగణంలో సంచరిస్తున్న పాము ఓ ద్విచక్ర వాహనంలోకి దూరడంతో అక్కడికి వచ్చిన ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాము వాహనంలోని వివిధ భాగాల్లోకి వెళ్లడంతో దానిని బయటకు పంపేందుకు వాహనదారులు చాలాసేపు శ్రమించాల్సి వచ్చింది. చివరకు ఎంతో కష్టపడి పామును బయటకు పంపించడంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, హాసన్‌పర్తి మండల కేంద్రంలో ఒకే ప్రాంతంలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఎంఆర్ఓ, ఏఈఓ కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ కూడా ఉండటంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కార్యాలయాల పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడం, ఖాళీ ప్రదేశాల్లో పరిశుభ్రత లోపించడం వల్ల పాములు, ఇతర విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పాము ద్విచక్ర వాహనంలోకి దూరిన ఘటన కార్యాలయాల పరిసరాల పరిశుభ్రత, ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకుంటే కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి, పిచ్చిమొక్కలు, పొదలు లేకుండా చూడాలని కోరుతున్నారు. ప్రతిరోజూ శుభ్రత పనులు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పాములు, విషపురుగులు సంచరించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు అప్రమత్తమై ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఒకే ప్రాంగణంలో ఇన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ పరిసరాల పరిశుభ్రతపై తగిన శ్రద్ధ చూపకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా మండల, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సమగ్ర చర్యలు చేపడతారా? ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పిస్తారా? ఈ ఘటనపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే!



కేయూలో డిటెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి





బీ-ఫార్మసీ విద్యార్థులకు న్యాయం చేయాలి.. పీడీఎస్‌యూ, ఏబీఎస్ఎఫ్ డిమాండ్
వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కేయూ రిజిస్ట్రార్

హన్మకొండ, 15 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలో అమలవుతున్న డిటెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, అన్యాయానికి గురవుతున్న బీ-ఫార్మసీ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌తో బుధవారం బీ-ఫార్మసీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీ లైబ్రరీ నుంచి విద్యార్థులు భారీ ర్యాలీగా బయలుదేరి వీసీ భవనానికి చేరుకున్నారు. అనంతరం వీసీ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు తిరిగి విద్యను కొనసాగించే అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంకు అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత విద్యను కొనసాగించే హక్కును కాలరాస్తున్న డిటెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ అధికారులపై ఉందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యా విధానాలు రూపొందించాల్సిన అధికారులు, అందుకు విరుద్ధంగా విద్యార్థులను చదువులకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యారంగంలో డ్రాపౌట్లను తగ్గించేందుకు ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిస్తుంటే, మరోవైపు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను చదువులకు దూరం చేసే విధానాలను అమలు చేయడం విరుద్ధమని వారు విమర్శించారు. కేయూలో డిటెన్షన్ విధానం కొనసాగితే ఉన్నత విద్యలో విద్యార్థుల మధ్యలోనే చదువులు మానేసే పరిస్థితులు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో తీసుకొచ్చే సంస్కరణలు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి తప్ప, వారి చదువులను మధ్యలోనే నిలిపివేసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉండకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా బీ-ఫార్మసీ ఫస్టియర్, సెకండియర్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఒకటి లేదా రెండు బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్నాయనే కారణంతో డిటైన్ చేసి, తదుపరి చదువులకు దూరం చేయడం తీవ్ర అన్యాయమని అన్నారు. విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించాల్సింది పోయి, వారిని విద్యకు దూరం చేసే అధికారం విశ్వవిద్యాలయ అధికారులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ విధానం వల్ల ముఖ్యంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలతో పాటు ముస్లిం, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేయూలో అమలవుతున్న డిటెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయడంతో పాటు, ఈ విధానం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సుమారు 500 మంది బీ-ఫార్మసీ విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను ఐక్యం చేసి విశ్వవిద్యాలయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం: రిజిస్ట్రార్ హామీ

విద్యార్థుల ఆందోళనపై స్పందించిన కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ధర్నా ప్రాంగణానికి చేరుకొని ఆందోళన చేస్తున్న విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారు చేస్తున్న డిమాండ్లను పరిశీలించి సంబంధిత విభాగాల కమిటీలతో చర్చిస్తామని తెలిపారు. వారం రోజుల్లోగా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్ హామీ నేపథ్యంలో విద్యార్థులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, వీసీకే విద్యార్థి సంఘ నాయకుడు అంబాల అనిల్ కుమార్, పీడీఎస్‌యూ నాయకులు సిద్ధు, అదిర్, ఆల్తాఫ్, అనూష, మనీషా, శిరీష, వరుణ్, ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షులు అద్దా రాజేష్, సాయి యాదవ్, షయీఫ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి, బీ-ఫార్మసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు మరోసారి స్పష్టం చేశారు.

కాకతీయ యూనివర్సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ చేపట్టిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని, విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జాతీయ సేవా పథకం మొదటి, రెండో విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరం వివిధ సేవా కార్యక్రమాలతో కొనసాగుతోంది. పరిశుభ్రత -- పచ్చదనం అనే నినాదంతో నవంబర్ 23న ప్రారంభమైన ఈ శిబిరంలో భాగంగా మూడో రోజైన నవంబర్ 26న కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ప్రొఫెసర్ ఈ. నారాయణ నాయకత్వం వహించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా యాభై మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని నవంబర్ 23న ప్రొఫెసర్ ఈ. నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ డి. శైలజ, డాక్టర్ ఎం. సౌజన్య పాల్గొన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, ప్లాస్టిక్ రహిత పరిసరాల నిర్మాణానికి కృషి చేయడం, పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, పర్యావరణ స్పృహ పెంపొందుతాయని పేర్కొన్నారు.



జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డీఎస్పీలు

ఐదుగురు ట్రైనీ డీఎస్పీలకు కలెక్టర్ శుభాకాంక్షలు



హనుమకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

2025 గ్రూప్-1 నియామక ప్రక్రియలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లుగా ఎంపికైన ఐదుగురు అధికారులు శిక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీలు తమ శిక్షణ, విధుల ప్రారంభం తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. పోలీస్ శాఖలో శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తూ పరిపాలనా అంశాలు, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధానాలపై అనుభవం పొందనున్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ డీఎస్పీలలో శాంతన్ కుమార్ రెడ్డి, సాయి ప్రత్యూష్ రెడ్డి, సబిత, అంజనేయులు, యశస్విని ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు.

49వ డివిజన్ భగత్ సింగ్ నగర్ గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

200 మంది నిరుపేదలకు 58 జీవో ప్రకారం వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలి: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మంద సంపత్



హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్):

హనుమకొండ నగరంలోని 49వ డివిజన్ పరిధిలో గల భగత్ సింగ్ నగర్ గుడిసె వాసులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు, హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కాజీపేట మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా 27వ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో సుమారు 200 మంది నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న పేదలు సొంతంగా పక్కా ఇళ్లు నిర్మించుకోవాలనే ఆశతో అక్కడ నివసిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత భూమిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 58 ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేసి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలని తహసీల్దార్‌ను కోరారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హనుమకొండ సౌత్ మండల కమిటీ సభ్యులు ఇస్లావత్ రవీందర్, నకరకంటి సుకర్ణ, జగనాల ఉప్పలయ్య, సప్పిడి మనోహర్, దూడపాక రాజేందర్, రేణుకుంట్ల చందర్, కుమ్మరి రవీందర్, బొక్కల కుమార్, ఆలకుంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో 'ది జామెట్రీ ఆఫ్ లైఫ్' పుస్తకావిష్కరణ

హన్మకొండ, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)



కాకతీయ విశ్వవిద్యాలయంలో 'జీవితపు జ్యామితి -- ప్రవాసం, ఆకాంక్షలు, నిరాశలు' అనే పుస్తకాన్ని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ ఎం. రవీందర్ రచించిన ఈ పుస్తకానికి డాక్టర్ ఆర్. మేఘనారావు సంపాదకత్వం వహించారు. ప్రముఖ రచయిత్రి సుమిత్రా గుప్తా నవలలోని ప్రధాన భావనలు, ఆలోచనలను ఆధారంగా చేసుకొని ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు రచయిత డాక్టర్ ఎం. రవీందర్ తెలిపారు. ముఖ్యంగా ప్రవాస జీవితం, మానవ సంబంధాలు, వ్యక్తుల ఆకాంక్షలు, ఆశలు, నిరాశలు, జీవన అనుభవాలు వంటి విభిన్న అంశాలను ఇందులో విశ్లేషించినట్లు వివరించారు. సాహిత్యంలోని సామాజిక, మానవీయ కోణాలను పరిశోధనాత్మక దృక్పథంతో పాఠకులకు అందించడమే ఈ రచన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సాహిత్యం సమాజంలోని మానవ సంబంధాలు, జీవన అనుభవాలు, సామాజిక పరిణామాలను ప్రతిబింబించే శక్తివంతమైన మాధ్యమమని అన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులు, మానవ జీవితంలోని విభిన్న అనుభవాలను సాహిత్యం ద్వారా అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. విభిన్న సాహిత్య అంశాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధనాత్మక దృక్పథంతో పుస్తకాలను రచించడం అభినందనీయమని తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ప్రొఫెసర్ బి. సురేష్ లాల్, డాక్టర్ బి. నాగరాజు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ ఎం. రవీందర్‌ను, సంపాదకులు డాక్టర్ ఆర్. మేఘనారావును పలువురు అభినందించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ అధ్యాపకుల చాక్‌డౌన్ విజయవంతం

కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను అమలు చేయాలి - ఉద్యోగ భద్రత కల్పించాలి
సురేష్‌లాల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని పార్ట్‌టైమ్ అధ్యాపకుల డిమాండ్

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాక్‌డౌన్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పార్ట్‌టైమ్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సురేష్‌లాల్ కమిటీ సిఫార్సులను అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్ట్‌టైమ్ అధ్యాపకులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించడం, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడం, సురేష్‌లాల్ కమిటీ సిఫార్సులను అమల్లోకి తీసుకురావడంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా పార్ట్‌టైమ్ అధ్యాపకులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ చాక్‌డౌన్ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ, డిగ్రీ కళాశాలలకు చెందిన పార్ట్‌టైమ్ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి పీజీ కళాశాల, ఉమెన్స్ కళాశాల, ఖమ్మం పీజీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్స్ డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ ఓ. మోహన్, డాక్టర్ డి. శ్రీకాంత్ యాదవ్, అడ్వైజర్స్ డాక్టర్ ఏ. కుమారస్వామి, డాక్టర్ టీ. ఉప్పయ్య, అధ్యక్షుడు డాక్టర్ కేకే రాజేందర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ కే. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. వాణిదేవి, ట్రెజరర్ మౌనిక, కన్వీనర్ టీ. భాగ్యమ్మ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. శ్యాంసుందర్ చారి, డాక్టర్ టీ. జ్యోత్స్న, డాక్టర్ ఆర్. రజిత, జాయింట్ సెక్రటరీలు డాక్టర్ రవిబాబు, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ మాణిక్యం, హరికృష్ణతో పాటు వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని అసోసియేషన్ నాయకులు మరోసారి డిమాండ్ చేశారు.

అంధత్వ నివారణకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జాయింట్ డైరెక్టర్ డా. ఎం. సువర్ణ ఆకస్మిక తనిఖీలు
13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలే లక్ష్యం

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



తెలంగాణ రాష్ట్రంలో అంధత్వ నివారణ, దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ అంధత్వ నివారణ మరియు దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం (ఎన్.పి.సి.బి.వి.ఐ) అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, జాతీయ అంధత్వ నియంత్రణ అధికారి డా. ఎం. సువర్ణ నవంబర్ 25న హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మహమ్మద్ ముష్రఫ్ అలీ ఫారూఖ్, ఐఏఎస్ ఆదేశాల మేరకు, ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. బి. రవీంద్ర నాయక్ మార్గదర్శకత్వంలో ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలు, కంటి శస్త్రచికిత్సలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ, నేత్రదాన కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా సమీక్షించారు. పర్యటనలో భాగంగా హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థుల్లో దృష్టి లోపాలను గుర్తించే విధానం, కంటి పరీక్షల పురోగతి, అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ, తదుపరి వైద్య సేవల అందుబాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ సుబేదారిలోని ఐడీఓసీ సముదాయంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. టి. మదన్ మోహన్ రావుతో సమావేశమయ్యారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం అమలు, నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. పాఠశాలలు, గురుకులాల్లో కంటి పరీక్షల నిర్వహణ మరింత వేగవంతం చేయాలని సూచించారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి డా. రామ్ భార్గవ్‌తో అంధత్వ నివారణ కార్యక్రమం అమలుపై చర్చించారు. అనంతరం వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని సందర్శించి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. శ్రీకుమార్‌తో సమావేశమై కార్యక్రమాల అమలుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. 2026-27 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, మైనారిటీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఇతర విద్యాసంస్థల్లో సుమారు 13.25 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాఠశాలల వారీగా కంటి పరీక్షల వేగాన్ని పెంచాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, నేత్ర వైద్య నిపుణుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దృష్టి లోపాలను ముందుగానే గుర్తించి అవసరమైన వారికి సకాలంలో ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు, మరింత వైద్య చికిత్స అవసరమైన విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షల కార్యక్రమంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని సమీక్షలో గుర్తించారు. కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను అధిగమించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని డా. ఎం. సువర్ణ సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 1976లో ప్రారంభమైన జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం నేటికీ ప్రజారోగ్య వ్యవస్థలో కీలకమైన కార్యక్రమంగా కొనసాగుతోందని, కంటి శస్త్రచికిత్సలు, పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాల పంపిణీ, నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా అంధత్వం, దృష్టి లోపాలను తగ్గించవచ్చని వివరించారు. ప్రతి విద్యార్థికి స్పష్టమైన చూపు, ప్రతి అర్హుడికి నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడమే జాతీయ అంధత్వ నివారణ మరియు దృష్టి లోపాల నియంత్రణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పర్యటన, సమీక్ష సమావేశాల్లో హనుమకొండ ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. టి. మదన్ మోహన్ రావు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రతాపగిరి ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోల రాజేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ కృష్ణ, హసన్‌పర్తి వైద్యాధికారి డా. రామ్ భార్గవ్, ఆర్‌బీఏస్‌కే వైద్యులు డా. కుమారస్వామి, డా. శ్రీనివాస్, డా. ఆదినారాయణ, డా. జ్యోతి, సబ్ యూనిట్ ఆఫీసర్ విప్లవ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ లచ్చు, నర్సింగ్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్ వివరాల నమోదులో పొరపాట్లకు తావుండకూడదు

అధికారులకు ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశాలు



ఏటూరునాగారం, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ వివరాల నమోదు, అప్‌డేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా అందాలంటే వారి వ్యక్తిగత వివరాలు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం ఏటూరునాగారం పరిధిలోని పెద్దగొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆధార్ వివరాల నమోదు, అప్‌డేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డుల్లో విద్యార్థుల పేర్ల స్పెల్లింగ్, ఫొటోలు, ఇతర వ్యక్తిగత వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. ఎక్కడైనా తప్పులు, వివరాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లయితే వెంటనే సరిచేసి అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ఆధార్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడంతోనే సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలోనూ ధృవీకరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని భోజనశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, భోజన ఏర్పాట్లు, పాఠశాల పరిసరాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన భోజనం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు విద్యతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే ఆధార్, బ్యాంకు ఖాతాలు తదితర కీలక వివరాలు సక్రమంగా ఉండటం ఎంతో అవసరమని పీఓ పేర్కొన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని లెనిన్ వత్సల్ టోప్పో స్పష్టం చేశారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయాలి

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్.. డీఈఓకు వినతిపత్రం

మహబూబాబాద్, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న నిర్వహించనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు భూక్య రాంజీ నాయక్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. విద్యార్థులకు భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే అదే రోజున స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు నిర్ణయించడంతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో జరిగే రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులందరూ విద్యార్థులతో కలిసి వేదుకల్లో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కావున నవంబర్ 26న జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేసి, మరో అనువైన తేదీలో నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు భూక్య రాంజీ నాయక్ ఆధ్వర్యంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై అధికారులు సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సంఘం కోరింది.



రాష్ట్రపతి నిలయం నుంచి కాకతీయ విద్యార్థిని సంధ్య బైరెడ్డికి ఆహ్వానం

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



జాతీయ స్థాయిలో కాకతీయ విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకొచ్చేలా మరో విద్యార్థిని అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఫైవ్ ఇయర్ ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విభాగం తొమ్మిదవ సెమిస్టర్ విద్యార్థిని, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్ సంధ్య బైరెడ్డికి జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. నవంబర్ 26, 2026న ఉదయం 9 గంటల నుంచి రాష్ట్రపతి నిలయంలో నిర్వహించనున్న జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన యువ సాధకులతో విద్యార్థులకు ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సంధ్య బైరెడ్డి తన విజయ ప్రస్థానం, వ్యక్తిగత అనుభవాలు, సామాజిక సేవలో తనకు ఎదురైన అనుభవాలు, స్ఫూర్తిదాయకమైన అంశాలను విద్యార్థులతో పంచుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు భారత రాజ్యాంగం, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలు, ప్రాథమిక హక్కులు, పౌరుల విధులపై అవగాహన కల్పించనున్నారు. యువతలో సృజనాత్మకత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవ పట్ల ఆసక్తి, స్ఫూర్తిని పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా రాజ్యాంగ పీఠిక పఠనం, పార్లమెంట్ నమూనా ప్రదర్శన, డాక్యుమెంటరీ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్, ర్యాపిడ్ ఫైర్ క్విజ్, ఫోటో ఎగ్జిబిషన్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి నిలయం నుంచి ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందుకోవడం కాకతీయ విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా సంధ్య బైరెడ్డిని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, డీన్ ఆచార్య బి. సురేష్ లాల్, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ టి. రాధిక అభినందించారు. జాతీయ స్థాయి వేదికపై తన అనుభవాలను పంచుకునే అవకాశం దక్కించుకున్న సంధ్య బైరెడ్డిని పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందిస్తున్నారు.

తొర్రూరు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ ఎన్. శ్వేత





శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం

తొర్రూరు, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, పోలీసు విధుల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశమైన డీఐజీ ఎన్. శ్వేత పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. అంతకుముందు డీఐజీ కార్యాలయానికి చేరుకోగానే మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్, తొర్రూరు డీఎస్పీ కె. కృష్ణ కిషోర్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ



తనిఖీ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్, తొర్రూరు డీఎస్పీ కె. కృష్ణ కిషోర్, తొర్రూరు సీఐ టి. గణేష్, మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్, తొర్రూరు ఎస్ఐ టి. మహేందర్ రెడ్డితో పాటు దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, పెద్దవంగర, సీరోల్, మరిపెడ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం గ్రాండ్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ



హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీపడుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా రూపొందించిన గ్రాండ్ టెస్ట్ పేపర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీఐ రవికుమార్, ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రొఫెసర్ నారాయణ, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ పుల్ల కుమారస్వామి సంయుక్తంగా గ్రాండ్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు నిరంతర సాధన, క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కేవలం చదవడమే కాకుండా పరీక్షల సరళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిరంతరం మాక్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు రాస్తూ తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలని తెలిపారు. గ్రాండ్ టెస్ట్ పేపర్ ద్వారా అభ్యర్థులకు పోటీ పరీక్షలపై మరింత అవగాహన పెరగడంతో పాటు సమయ నిర్వహణ నైపుణ్యాలు, ప్రశ్నలను విశ్లేషించే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం మెరుగుపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇటువంటి పరీక్షలు అభ్యర్థులు తమలోని లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టుదలతో కృషి చేసి పోలీస్ ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి.. అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




వరంగల్, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఉప్పరపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన నిర్మాణ పనుల పురోగతిని, వివిధ విభాగాలకు సంబంధించిన నిర్మాణాల స్థితిగతులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలపై ఆరా తీశారు. పాఠశాల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించే లక్ష్యంతో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేస్తూనే నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలి: ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్

హసన్‌పర్తి, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖదర్ (50) అదృశ్యమైనట్లు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన భీమారంలోని రమేష్ చికెన్ సెంటర్‌లో పని ముగించుకుని ఇంటికి వచ్చిన ఖదర్, గ్రామంలో ఫంక్షన్‌కు వెళున్నట్లు చెప్పి బయటకు వెళ్లాడు. అయితే ఫంక్షన్‌కు వెళ్లకుండా మెయిన్ రోడ్డులో అంబాల--పరకాల బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా తాను హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 12.57 గంటలకు ఆయన ఫోన్ కొద్దిసేపు ఆన్ అయి తిరిగి స్విచ్ ఆఫ్ అయింది. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి 7 గంటలకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన సమయంలో ఖదర్ టీ-షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 8712685015 లేదా 9849827935 నంబర్లకు సమాచారం అందించాలని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్ కోరారు.

జిల్లా ఓబీసీ మోర్చా కమిటీ సభ్యుడిగా గుర్రం సురేష్ గౌడ్ నియామకం

నియామకంపై హర్షం.. సహకరించిన పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు

హన్మకొండ జిల్లా/కమలాపూర్, 25 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)



జిల్లా ఓబీసీ మోర్చా కమిటీ సభ్యుడిగా గుర్రం సురేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. పార్టీ నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యత పట్ల గుర్రం సురేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ, తన నియామకానికి సహకరించిన నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఓబీసీ మోర్చా కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్‌లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా తన నియామకానికి పరోక్షంగా సహకరించిన జిల్లా మాజీ అధ్యక్షులు, తన గురువు గంగాది కృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుర్రం సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. నాయకుల సహకారం, ఆశీస్సులతో ప్రజలకు, పార్టీకి అంకితభావంతో సేవలందిస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఓబీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని గుర్రం సురేష్ గౌడ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వ్యక్తి మృతి

చికిత్స పొందుతూ తుదిశ్వాస.. హసన్‌పర్తి పోలీసుల కేసు నమోదు

హసన్‌పర్తి, నవంబర్ 25 (జై భీమ్ క్రైమ్ న్యూస్)

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హసన్‌పర్తి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బైరన్‌పల్లి గ్రామానికి చెందిన కల్లెబోయిన సాంబయ్య (56) ఈ నెల 23వ తేదీన నాగారం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అనంతరం చేపలను కుమార్‌పల్లి మార్కెట్‌లో విక్రయించి సాయంత్రం తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బైరన్‌పల్లి గ్రామ శివారులోని ఐకేపీ కేంద్రం సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మొదట వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అక్కడి నుంచి హనుమకొండలోని లైఫ్‌లైన్ ఆసుపత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నవంబర్ 24వ తేదీ రాత్రి 7.24 గంటలకు సాంబయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు కల్లెబోయిన అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకుల మహాధర్నా

హన్మకొండ, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కదం తొక్కారు. స్టేట్ జేఏసీ పిలుపు మేరకు బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు భారీ స్థాయిలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నాయకులు డాక్టర్ పి. కరుణాకర్ రావు, డాక్టర్ సాధు రాజేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా విద్యాబోధన చేస్తూ ఉన్నత విద్యాభివృద్ధికి కాంట్రాక్ట్ అధ్యాపకులు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వారి సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్ట్ అధ్యాపకుల పట్ల వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తక్షణమే యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, యూజీసీ పే స్కేల్ వర్తింపజేయాలని వారు స్పష్టం చేశారు. ఈ మహాధర్నాలో డాక్టర్ బైరి నిరంజన్, డాక్టర్ మాదాసి కనకయ్య, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ టి. నాగయ్య, డాక్టర్ రంగారెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ సదాశివ్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మధుకర్, డాక్టర్ సుచరిత పాల్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ సరిత, రాజేశ్వరి, డాక్టర్ కవిత, డాక్టర్ రమాదేవి, డాక్టర్ జుల సత్య, డాక్టర్ సంగీత్ అమరేందర్ తదితర కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలి: కేటీఆర్ డిమాండ్

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తున్న నేతల అరెస్ట్‌పై కేటీఆర్ మండిపాటు


ట్రక్ పార్క్ భూమి వేలాది మందికి జీవనోపాధి అన్న కేటీఆర్

కూకట్‌పల్లి, జై భీమ్ న్యూస్

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన విపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా అఖిలపక్ష నేతలు చేపట్టిన నిరసన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులతో పాటు పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంపై కేటీఆర్ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ఘాటుగా స్పందించారు. “కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజా సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు” అని మండిపడ్డారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని కేటీఆర్ స్పష్టం చేశారు. నగర అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన స్థలాలను వేలం వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

కేసముద్రం సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ ఎన్. శ్వేత





మహబూబాబాద్, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పెండింగ్ కేసుల వివరాలను, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, కేసుల విచారణకు సంబంధించిన అంశాలను సమీక్షించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీ సందర్భంగా కేసముద్రం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సత్యనారాయణ పూల మొక్కను అందించి డీఐజీ ఎన్. శ్వేతకు స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ తనిఖీలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్, కేసముద్రం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి కిరణ్, ఇనుగుర్తి ఎస్ఐ పి. నరేష్, నెల్లికుదురు ఎస్ఐ జి. కర్ణాకర్‌తో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పేరుతో నకిలీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)



విద్యుత్ బిల్లుల చెల్లింపుల పేరుతో సైబర్ నేరగాళ్లు పంపిస్తున్న నకిలీ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాల పట్ల విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.తిలక్ కుమార్ సూచించారు. విద్యుత్ బిల్లు బకాయి ఉందని, వెంటనే చెల్లించకపోతే అదే రోజు రాత్రి 8 గంటల తర్వాత విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, కనెక్షన్ తొలగిస్తామని గుర్తుతెలియని మొబైల్ నంబర్ల నుంచి సందేశాలు వస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సందేశాలను నమ్మవద్దని, వాటిలో ఇచ్చిన లింకులను క్లిక్ చేయవద్దని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు పంపించే నకిలీ లింకులను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. విద్యుత్ బిల్లులు, చెల్లింపులకు సంబంధించిన వివరాలను అధికారిక మార్గాల ద్వారానే నిర్ధారించుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులు, సరఫరా, ఇతర సేవలకు సంబంధించి సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా వాట్సాప్ నంబర్ 9493681912 ద్వారా సంప్రదించాలని తెలిపారు. వినియోగదారులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి నకిలీ సందేశాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కె.తిలక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి





ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతికంగా కేసుల దాఖలుకు అవకాశం కల్పించాలి
న్యాయవాదులకు సమగ్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలి.. ఐఏఎల్ డిమాండ్

వరంగల్, 25 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి సమగ్ర చర్యలు చేపట్టాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) వరంగల్, హనుమకొండ జిల్లా కౌన్సిళ్లు డిమాండ్ చేశాయి. ఈ మేరకు న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన డిమాండ్ల పోస్టర్‌ను బుధవారం వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఐఏఎల్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. గీతామాకు, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్. సునీతకు అందజేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భీమనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు, మొదటితరం న్యాయవాదులు, ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ-ఫైలింగ్‌తో పాటు భౌతికంగా కేసులు దాఖలు చేసే విధానాన్ని కొనసాగించాలని, న్యాయవాదులకు ఆరోగ్య బీమా, పెన్షన్, జూనియర్ న్యాయవాదులకు నెలవారీ స్టైఫండ్ అందించాలని కోరారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులను అరికట్టి రక్షణ కల్పించడంతో పాటు కోర్టుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిజిటలైజేషన్ న్యాయవ్యవస్థను మరింత సులభతరం చేయాలే తప్ప న్యాయవాదులు, కక్షిదారులకు ఇబ్బందులు కలిగించకూడదని పేర్కొన్నారు. న్యాయవాదులు, వారి కుటుంబాలకు ఆరోగ్య కార్డులు, నగదు రహిత వైద్య సదుపాయం, అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ బలోపేతం, పెన్షన్, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, కోర్టుల్లో ఛాంబర్లు, బార్ రూములు, లైబ్రరీలు, తాగునీరు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే ఫైలింగ్ కౌంటర్ల సంఖ్య పెంచి సర్టిఫైడ్ కాపీలను సకాలంలో అందించాలని, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వాష్‌రూములు, వెయిటింగ్ రూములు, భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నూతన చట్టాలు, ఈ-కోర్టులు, డిజిటల్ ఆధారాలపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం, సంబంధిత న్యాయ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని ఐఏఎల్ నాయకులు కోరారు. న్యాయవాదుల సంక్షేమం బలోపేతం అయినప్పుడే న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, బల్లా ప్రభాకర్, కె. చిరంజీవి, చంద్ర మౌళి, శ్రవణ్ కుమార్, ఎన్. కార్తీక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు కావాలి





జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ రోల్ అబ్జర్వర్ ఏ. సూర్యకుమారి

రాజమహేంద్రవరం, నవంబర్ 25 (జై భీమ్ న్యూస్)

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకునేలా చర్యలు వేగవంతం చేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ రోల్ అబ్జర్వర్ ఏ. సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. 2024 ఎన్నికలతో పోలిస్తే 2026లో ఓటరు నమోదు దరఖాస్తుల సంఖ్య పెరిగినప్పటికీ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఓటర్ల జాబితా తయారీ, సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాల పాటు అర్హత కలిగిన విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా పనిచేసిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అందిన ఫారం-19 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు డిసెంబర్ 27 వరకు గడువు ఉందని, తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 2న ప్రచురించనున్నట్లు అధికారులు వివరించారు. బోధనేతర సిబ్బంది, గెస్ట్ ఫ్యాకల్టీ విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని, బల్క్ దరఖాస్తులను అనుమతించకుండా ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో 2021లో 3,139 మంది, 2024లో 2,990 మంది తుది ఓటర్లుగా నమోదయ్యారని, 2026 ఎన్నికలకు ఇప్పటివరకు 3,274 దరఖాస్తులు అందాయని తెలిపారు. గతంలో 22 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈసారి 23 కేంద్రాలను ప్రతిపాదించినట్లు వివరించారు. జిల్లాలో ప్రభుత్వ రంగంలో 303, ప్రైవేట్ రంగంలో 491 కలిపి మొత్తం 794 విద్యాసంస్థలు ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమోదు మరింత పెరగాల్సి ఉందన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఒక ప్రాంతంలో పనిచేస్తూ మరో ప్రాంతంలో నివసించే ఉపాధ్యాయులు తమ నివాస చిరునామా ఉన్న ప్రాంతంలోనే ఓటు నమోదు చేసుకోవాలని, ఆధార్‌లో పాత చిరునామా ఉంటే తహశీల్దార్ జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, తిరస్కరించిన దరఖాస్తులకు గల కారణాలను ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.ఆర్.ఆర్. ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావు, ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఐ. శారద, జిల్లా వృత్తి విద్యా అధికారి మేరీ సుజాత, ఎన్నికల అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా తెలంగాణ

'ఖేలో ఇండియా గేమ్స్'పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
డిసెంబర్ 11 నుంచి తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్
ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవం గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు
ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు
తొలిసారి ప్రదర్శన క్రీడగా తెలంగాణ సంప్రదాయ కర్రసాము
క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఈ క్రమంలో రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల ఏర్పాట్ల పురోగతిపై క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. యువతలో నూతన ఉత్సాహం నింపేలా డిసెంబర్ 11న ఖేలో ఇండియా పోటీలను అత్యంత అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రారంభ వేడుకలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ అంతటా క్రీడా వాతావరణం, క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. స్టేడియంల పునరుద్ధరణ, క్రీడా ప్రాంగణాల ఆధునికీకరణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, పనులపై విజిలెన్స్ నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ భారీ క్రీడా ఈవెంట్ ప్రారంభ, ముగింపు వేడుకల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించనున్నారు. పోటీలు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లోనూ జరుగుతున్నందున, జిల్లాల వారీగా మంత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు కేటాయించారు. హైదరాబాద్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహబూబ్‌నగర్‌కు జూపల్లి కృష్ణారావు, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కరీంనగర్‌కు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మంకు తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ యుద్ధ కళ 'కర్రసాము' ఈ పోటీల్లో తొలిసారిగా ప్రదర్శన క్రీడగా అడుగుపెడుతుండటం విశేషం. ఈ సందర్భంగా కర్రసాము ప్రత్యేక బ్రోచర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. జాతీయ వేదికపై కర్రసాముకు తగిన గుర్తింపు కల్పించడం వల్ల ఈ ప్రాచీన కళకు, స్థానిక క్రీడాకారులకు గొప్ప ప్రోత్సాహం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు నాటికి స్టేడియాల మరమ్మతులు, మౌలిక వసతుల పనులతో పాటు 27 క్రీడలకు అవసరమైన అత్యాధునిక క్రీడా పరికరాలు సిద్ధం చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోటీలు నిర్వహించే మొత్తం ప్రాంగణాల్లో ఇప్పటికే 14 స్టేడియాలలో పనులు పూర్తికాగా, మిగిలిన 6 చోట్ల నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు తెలంగాణకు చెందిన 1,334 మంది అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు అవసరమైన అధునాతన స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతమైన నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 203 కోట్లు వెచ్చిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 21 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేవలం స్టేడియాల ఆధునీకరణ, అంతర్జాతీయ స్థాయి పరికరాల కొనుగోలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 120 కోట్లు కేటాయించింది. భవిష్యత్తులో తెలంగాణ అంతర్జాతీయ ఈవెంట్లకు వేదిక కావాలనే దీర్ఘకాలిక వ్యూహంతో ఈ క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM